

సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్, కార్పొరేటర్ శ్వేతారెడ్డి

రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధి

సైదాబాద్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా యాఖత్‌పురా నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను దశలవారీగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ అన్నారు. శనివారం ఐఎస్‌సదన్ డివిజన్ లక్ష్మీనగర్ కాలనీలో కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డి, వివిధ శాఖల అధికారులు, కాలనీవాసులతో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. థీమ్‌పార్కులో నిర్వహించిన సమావేశంలో స్థానిక సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీ అధ్యక్షుడు సీఎస్ రెడ్డి, కార్యదర్శి రవీందర్‌రెడ్డి ఎమ్మెల్యే, కార్పొరేటర్ల దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే అభివృద్ధి పనులలో అధికారులు అలసత్వం వహిస్తే సహించనని హెచ్చరించారు. ఇక నుంచి డివిజన్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తానని హామీ ఇచ్చారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ డీసీ శైలజ, ఏఈ ఏకాంబరం, ఏఈ శిరీష, జలమండలి, ఉద్యానవన, విద్యుత్ అధికారులు, కాలనీవాసులు శ్రీధర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ హాల్ ప్రారంభం



బార్ అసోసియేషన్ హాల్‌ను ప్రారంభిస్తున్న హైకోర్టు జడ్జి సాం కోషి

హయత్‌నగర్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ కోర్టు ఆవరణలో నూతనంగా నిర్మించిన బార్ అసోసియేషన్ హాల్‌ను శనివారం హైకోర్టు జడ్జి సాం కోషి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హయత్‌నగర్ కోర్టులో 8 వేల కేసులు పెండింగులో ఉన్నాయని తెలిపారు. పెండింగు కేసుల పరిష్కారం కోసం మరిన్ని కోర్టులు హయత్‌నగర్‌లో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా మొత్తం కేసుల కన్న ఇక్కడే ఎక్కువ కేసులు ఉన్నాయని అన్నారు. బార్ అసోసియేషన్ భవనాన్ని నిర్మించుకున్నందుకు బార్ అసోసియేషన్ సభ్యులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో హైకోర్టు జడ్జిలు బి. విజయసేన్‌రెడ్డి, నందికొండ నర్సింగ్‌రావు, రంగారెడ్డి జిల్లా జడ్జి శశిధర్‌రెడ్డి, హయత్‌నగర్ కోర్టు జడ్జి సల్మా ఫాతిమా, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డు భిక్షపతిగౌడ్, ప్రధాన కార్యదర్శి నందుటి సంతోష్‌కుమార్‌గౌడ్, అడ్వకేట్ కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ పి. శ్రీనాథ్, దండెం రాంరెడ్డి, మధుసూదన్, రామ్మోహన్, రవి, బండి నరేష్, ఈశ్వర్‌గౌడ్, లింగంగౌడ్ పాల్గొన్నారు.



పారిజాత, భారతమ్మలను సన్మానిస్తున్న కాలనీవాసులు

పదవి లేకున్నా బాధ్యత మరువం : పారిజాతారెడ్డి

సరూర్‌నగర్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రతినిధులుగా ఐదేళ్లు ప్రజల కోసం సేవ చేసినట్టుగానే పదవి ముగిసిన తర్వాత సైతం సేవ కొనసాగిస్తానని, పదవి లేకున్నా బాధ్యత మరువబోనని బడంగ్‌పేట్ కార్పొరేషన్ మాజీ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి అన్నారు. ఇక్కడి వెంకటాపూర్ 14వ డివిజన్ పరిధిలోని అమెరికన్ టౌన్‌షిప్, డ్రీమ్ లేక్ సిటీ కాలనీల ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా పారిజాతతో పాటు మాజీ కార్పొరేటర్ జెనిగె భారతమ్మాకొమురయ్యయాదవ్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం మాజీ మేయర్ మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా ప్రజా సేవలో తాము ముందుంటామని పేర్కొన్నారు. ఐదేళ్లు సేవ చేసే అవకాశం కల్పించిన ఓటర్లకు మాజీ కార్పొరేటర్ భారతమ్మాయాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బొర్ర జగన్‌రెడ్డి, ఆయా కాలనీల ప్రతినిధులు సైదాసాబ్, సాయినాథ్, విశాల్, హుస్సేన్‌భాయ్, సయ్యద్ ఆబిద్‌అలీ, ఇమామ్, బీఆర్‌ఎస్ నాయకుడు శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణారెడ్డి

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు : అరుణారెడ్డి

సైదాబాద్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపట్టామని కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి తెలిపారు. శనివారం జీఏ-1 కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు సత్వరమే పూర్తిచేసి కమ్యూనిటీ హాల్‌ను అందుబాటులోకి తేవాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ వెంకన్న, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, కాలనీ ప్రతినిధులు రామకృష్ణ, రమేష్, ఆనంద్ పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నిర్మాణ పనుల పరిశీలన

కొత్తపేట, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కమ్యూనిటీ హాల్ అదనపు గదుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ సూచించారు. రూ.34లక్షలతో చేట్టిన సీటీఓ కాలనీ కమ్యూనిటీ హాల్ అదనపు గదుల నిర్మాణ పనులను శనివారం ఆయన జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదనపు గదుల నిర్మాణం త్వరితగతిన ముగించాలన్నారు. కార్యక్రమంలో ఏఈ షరీఫ్, పారిశుధ్య విభాగం అధికారి ప్రేమ్, కాలనీ ప్రతినిధులు రవీందర్, విశ్వేశ్వర్‌రావు, నర్సింగ్‌రావు, దీక్షితులు, రాములు, రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను పరిష్కారానికి 10 దరఖాస్తులు



సర్కిల్ కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న దృశ్యం

ఓల్డ్‌మలక్‌పేట, మార్చి 1(ఆంధ్రజ్యోతి) : ఆస్తిపన్ను పరిష్కారం కోసం మలక్‌పేట సర్కిల్-6లో ఇప్పటి వరకు 10 దరఖాస్తులు వచ్చాయి. ఆస్తిపన్ను పరిష్కారం పేరుతో ప్రతి శనివారం సర్కిల్ కార్యాలయంలో ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటు చేశారు. ఏమైన కారణాలతో ఆస్తిపన్ను ఎక్కువ వచ్చిన వారు ఇక్కడ ఫిర్యాదు చేస్తే సిబ్బంది తక్షణమే ఆస్తి వద్దకు వచ్చి సరిచూస్తారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్కిల్-6 డిప్యూటీ కమిషనర్ జయంత్ తెలిపారు. మార్చితో వార్షిక సంవత్సరం ముగుస్తున్నందున ఆస్తిపన్ను చెల్లించని వారు విధిగా చెల్లించాలని కోరారు.

టార్గెట్ 19.82 కోట్లు..

వసూళ్లు 6.84 కోట్లు..!

- ఈ నెలాఖరులోగా టార్గెట్ పూర్తిపై అధికారుల దృష్టి
- మొండి బకాయిదారులకు రెడ్ నోటీసుల జారీ
- 9టీంలతో పన్ను వసూలు.. టార్గెట్ పూర్తి చేస్తాం
- కమిషనర్ రవీందర్‌రెడ్డి



పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ కార్యాలయం(ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): 2024-25 ఆర్థిక సంవత్సరం ఆస్తి పన్ను వసూళ్లలో పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ అధికారులు, సిబ్బంది నిమగ్నమయ్యారు. 2024-25 ఆర్థిక ఏడాది టార్గెట్ 19.82 కోట్లు కాగా ఫిబ్రవరి నెలాఖరు వరకు రూ.6 కోట్ల 84లక్షలను వసూలు చేశారు. మార్చి 31లోగా పెండింగ్ పన్నుల వసూలే లక్ష్యంగా అధికారులు చర్యలు చేపట్టారు. ఈ ఏడాది ఎలాగైనా 100శాతం పన్నుల వసూలే టార్గెట్‌గా కమిషనర్‌తో పాటు రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టారు. అందులో భాగంగా మొండి బకాయిదారులను గుర్తించి వారికి ముందస్తు రెడ్ నోటీసులను జారీ చేస్తున్నారు. ఇప్పటికే సుమారు 300 నుంచి 350 మంది మొండి బకాయిదారులకు నోటీసులను అందజేసినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతానికి 35శాతం పన్ను వసూలయిందని తెలిపారు.

టార్గెట్ పూర్తికి కృషి చేస్తున్నాం

ఉన్నత అధికారుల ఆదేశాలతో ఈ ఏడాది పన్ను వసూళ్ల టార్గెట్‌ను పూర్తి చేసేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నాం. ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి రోజువారీగా వసూళ్లు చేస్తున్నాం. మొండి బకాయిదారుల పట్ల కఠినంగానే వ్యవహరిస్తాం. ప్రజలు, కమర్షియల్ భవనదారులు సహకరించండి. పన్నులు చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి తోడ్పాటు అందించండి.



- రవీందర్‌రెడ్డి, కమిషనర్, పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ

టార్గెట్‌పై స్పెషల్ డ్రైవ్..

ఈ ఏడాది మార్చి నెలాఖరులోగా పన్ను వసూళ్ల టార్గెట్ డిమాండ్‌ను 100శాతం పూర్తి చేసేందుకు అధికారులను కసరత్తు మొదలు పెట్టారు. వీలైనంత త్వరలో టార్గెట్‌ను పూర్తి చేసేందుకు అధికారులు సిబ్బందితో కలిసి స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం చేపట్టారు. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 22,066 అసెస్‌మెంట్లు ఉన్నాయి. మున్సిపాలిటీలోని 24 వార్డులతో పాటు ఇటీవల అదనంగా విలీనం అయిన నాలుగు గ్రామాల్లో పన్నుల వసూళ్ల కోసం 9 టీంలను ఏర్పాటు చేశారు. ఒక్కో టీంలో అధికారితో పాటు నలుగురు బిల్ కలెక్టర్లు ఆయా వార్డుల్లో తిరుగుతూ పన్ను వసూళ్లలో పాల్గొంటున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో పాటు ఆటోలో మైక్‌ద్వారా పన్నులు చెల్లించాలని ప్రచారం చేయిస్తున్నట్లు చెప్పారు. రోజు 20 నుంచి 25 లక్షల రూపాయల పన్ను వసూలే టార్గెట్‌గా దృష్టి పెట్టినట్లు తెలిపారు. రెసిడెన్షియల్ చెల్లింపుదారులు రెగ్యులర్‌గా పన్నులను కడుతున్నా.. పెద్ద పెద్ద కమర్షియల్ భవనాల నిర్వాహకులే పన్నులు చెల్లించడంలో మొండికేస్తున్నట్లు తెలుస్తోంది. ఆ భవనాల వద్దనే పెద్ద మొత్తంలో బకాయిలు పేరుకుపోయినట్లు సమాచారం. ముఖ్యంగా అలాంటి వాటిపైనే ప్రత్యేక దృష్టి పెట్టినట్లు అధికారులు తెలిపారు. మొండి బకాయిదారుల భవనాల వద్ద సిబ్బందితో వినూత్న నిరసన కార్యక్రమాలు చేపట్టి పన్నులు కట్టిస్తున్నారు.



రేషన్ కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బలాల

రేషన్ కిట్ల పంపిణీ

చాదర్‌ఘాట్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని చావునీ డివిజన్‌లో శనివారం 50 మందికి రేషన్ కిట్లను మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల పంపిణీ చేశారు. డివిజన్‌లోని 50మంది ఇమామ్‌లు, మోజాన్లకు సుమారు రూ.3వేల విలువ చేసే రేషన్ కిట్లను పంపిణీ చేసినట్లు చావునీ కార్పొరేటర్ సలాం షాహిద్ మూన్ తెలిపారు. నెల రోజులకు సరిపడా రేషన్ కిట్లను పంపిణీ చేసినట్లు ఆయన వివరించారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

మన్సూరాబాద్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ సహారా ఎస్టేట్స్ సమీపంలోని ప్రధాన రోడ్డుపై గల ఫుట్‌పాత్ ఆక్రమణలను జీహెచ్‌ఎంసీ అధికారులు తొలగించారు. ఫుట్‌పాత్ ఆక్రమణలతో తలెత్తిన ట్రాఫిక్ సమస్యల దృష్ట్యా జోనల్ కమిషనర్ ఆదేశాలతో టౌన్‌ప్లానింగ్ అధికారులు శనివారం ఉదయం రంగంలోకి దిగి ఆక్రమణలను తొలగించారు. సహారా మొదటి గేటు నుంచి రెండో గేటు వరకు రోడ్డుకిరువైపులా వెలసిన సుమారు 30 ఆక్రమణలను జేసీబీతో నేలమట్టం చేశారు. ఇష్టానుసారంగా ఆక్రమణలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

యువతకు ఉద్యోగ కల్పనలకు సీఎం కృషి : మధుయాష్కీ



మహిళకు సర్టిఫికెట్‌ను అందజేస్తున్న మధుయాష్కీగౌడ్, కార్పొరేటర్

చంపాపేట, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో యువతకు ఉద్యోగ కల్పనల కోసం సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నట్లు టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ అన్నారు. హస్తినాపురం డివిజన్‌లోని ఏఎంఆర్ కన్వెన్షన్‌లో శనివారం ఫాక్స్‌కాన్ కంపెనీ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మధుయాష్కీగౌడ్ హాజరై కంపెనీ ప్రతినిధులతో కలిసి ఉద్యోగాలకు ఎంపికైన యువతీయువకులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగంతో పాటు ప్రైవేట్ రంగంలోను ఉద్యోగాల కల్పనల కోసం తెలంగాణ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. కాంగ్రెస్ యువనేత రాహుల్‌గాంధీ నిరుద్యోగ సమస్యను రూపుమాపేందుకోసం ప్రత్యేక చొరవతో తీసుకుంటున్నట్లు, దేశ విదేశాల నుంచి కంపెనీలను రాష్ట్రానికి రప్పిస్తున్నట్లు మధుయాష్కీగౌడ్ పేర్కొన్నారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీపీసీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్, కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్, మాజీ కార్పొరేటర్ వజీర్ ప్రకాష్‌గౌడ్, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి, నాయకులు గోపీరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, అశోక్‌గౌడ్, రామారావు, సత్యనారాయణ, వెంకటేష్, మహేందర్‌యాదవ్, శ్రీనివాస్, విద్యారెడ్డి, ఫాక్స్‌కాన్ కంపెనీ ప్రతినిధులు మణికంఠ, లోకేష్ పాల్గొన్నారు.

వర్గీకరణతోనే మాదిగ అమరవీరులకు నిజమైన నివాళి

సరూర్‌నగర్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణతోనే మాదిగ అమరవీరుల ఆత్మకు శాంతి చేకూరుతుందని, అదే వారికి ఇచ్చే నిజమైన నివాళి అని పలువురు ఎమ్మార్పీఎస్ నేతలు పేర్కొన్నారు. మాదిగ అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఇచ్చిన పిలుపు మేరకు శనివారం బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్ శివాజీ చౌక్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మాదిగ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా మాజీ అధికార ప్రతినిధి బొర్ర రవిమాదిగ, మస్కూరి శ్రీశైలంమాదిగ, సుధాకర్‌మాదిగ, అడ్డాకుల సురేశ్‌మాదిగ, డీకే నర్సింహమాదిగ, గట్టు కొండల్‌మాదిగ, డోల ప్రకాశ్‌మాదిగ పాల్గొన్నారు.

మన్సూరాబాద్ : ఎస్సీ వర్గీకరణకు పాటుపడిన మాదిగ అమరవీరుల త్యాగాలు మరువలేనివని, వారి స్ఫూర్తితోనే నేడు ఎస్సీ వర్గీకరణను సాధించామని ఎమ్మార్పీఎస్ ఎల్బీనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తిన సుధాకర్ మాదిగ పేర్కొన్నారు. ఎల్బీనగర్‌లోని మహనీయుల విగ్రహాల వద్ద శనివారం ఎస్సీ వర్గీకరణకు పాటుపడిన మాదిగ అమరవీరులకు నివాళులర్పించి వారి త్యాగాలను గుర్తు చేసుకున్నారు. నాయకులు ప్రకాశ్‌మాదిగ, రాజు, బుచ్చన్న, శేఖర్, పరుశరాము, పెద్ద హుస్సేన్, మౌలాలి, వెంకటేష్, రంగన్న, సునీల్ పాల్గొన్నారు.

నేడు జీఎస్ఐ వాకథాన్

మన్సూరాబాద్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): భారత భూవైజ్ఞానిక సర్వే(జీఎస్ఐ) సంస్థ స్థాపించి 175 వసంతంలోకి అడుగిడుతున్నందున ఆదివారం ఉదయం 8గంటలకు వాకథాన్ నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రజాసంబంధాల అధికారి డాక్టర్ గంజి మల్లేష్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం విడుదల చేసిన ఓ పత్రికా ప్రకటనలో నగరంలోని ట్యాంక్‌బండ్ వద్ద గల సంజీవయ్య చిల్డ్రన్స్ పార్కు నుంచి నెక్లెస్ రోడ్డు మీదుగా స్ఫూర్తి స్థల్ తిరిగి సంజీవయ్య చిల్డ్రన్స్ పార్కు వరకు వాకథాన్ కొనసాగుతోందని తెలిపారు. జీఎస్ఐ దక్షిణ క్షేత్ర కార్యాలయం నిర్వహించిన పనులపై రచించిన సావనీర్ పుస్తకంను సంస్థ హెచ్‌ఓడీ ఎస్‌డీ పట్నాజే చేతుల మీదుగా ఆవిష్కరించనున్నట్లు తెలిపారు.

'మధిర' సేవలు అభినందనీయం



సత్యనారాయణ సన్మానించి జ్ఞాపికను అందజేస్తున్న సూరజ్ దామోజీ పట్నాజే

మన్సూరాబాద్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సంస్థలో 40 ఏళ్లుగా మధిర సత్యనారాయణ అందించిన సేవలు అభినందనీయమని సంస్థ అడిషనల్ డైరెక్టర్ జనరల్, హెచ్‌ఓడీ సూరజ్ దామోజీ పట్నాజే కొనియాడారు. జీఎస్ఐ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా విధులు చేపట్టి పదవీ విరమణ పొందిన మధిర సత్యనారాయణ వీడ్కోలు సమావేశాన్ని శనివారం బండ్లగూడలోని జీఎస్ఐ మల్టీపర్పస్ హాలులో తెలంగాణ రీక్రియేషన్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మధిర సత్యనారాయణతో పాటు వారి కుటుంబ సభ్యులను సంస్థ హెచ్‌ఓడీ, ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా సన్మానించి ఆయన సేవలను కొనియాడారు. సంస్థ ఉద్యోగిగా, ఆలిండియా జీఎస్ఐ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సౌతెర్న్ రీజినల్ సెక్రటరీగా ఉద్యోగుల సమస్యపై పోరాడానని, ఇకపై తన శేషజీవితాన్ని సమాజ సేవకు ఉపయోగిస్తానని మధిర సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ వేడుకలో సంస్థ అధికారులు ఎల్‌పీ సింగ్, ఎస్ఎన్ పాత్రో, అన్నుమన్ ఆచార్య, ఆర్.సచిన్, హార్మోన్‌మిశ్రా, ఎస్.తారకేశ్వరరావు, కబీరాజ్ సెతి, డి.రాజగోపాల్, ఉద్యోగ సంఘాల నాయకులు ఆదర్ల మహేష్, జె.రాజశేఖర్, ఎం.చక్రేశ్వర్, బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.



హమాలీలకు గుర్తింపు లైసెన్సులను అందజేస్తున్న చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

హమాలీల సమస్యల పరిష్కారానికి కృషి

ఎల్బీనగర్ : మార్కెట్‌లోని హమాలీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఎన్టీఆర్‌నగర్ కూరగాయల మార్కెట్‌లో పని చేస్తున్న 75 మంది హమాలీలకు గుర్తింపు లైసెన్సులను పాలకవర్గం సభ్యులతో కలిసి చైర్మన్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ నిరంతరం శ్రమించే హమాలీలను కుటుంబ సభ్యులుగా పరిగణిస్తామని.. వారికి రావాల్సిన ప్రయోజనాలను తప్పకుండా అందిస్తామన్నారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సీహెచ్ భాస్కరాచారి, ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎల్. శ్రీనివాస్, వహీద్, పాలకవర్గం సభ్యులు మధుసూదన్‌రావు, జైపాల్‌రెడ్డి, నవరాజ్, గోవర్ధన్‌రెడ్డి, గణేష్‌నాయక్, రఘుపతిరెడ్డి, లక్ష్మి, అంజయ్య, నర్సింహ, ఇబ్రహీం, నాయకులు వీరయ్య, చంద్రమోహన్ పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అదృశ్యం



అనురాగ్‌రెడ్డి

హయత్‌నగర్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మూడు రోజుల క్రితం డ్యూటీకి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అదృశ్యమైన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హయత్‌నగర్ డిఫెన్స్ కాలనీలో నివాసం ఉండే మలిపెద్ది అనురాగ్‌రెడ్డి(31) శివరాత్రి రోజున మాదాపూర్‌లోని సాఫ్ట్‌వేర్ కార్యాలయానికి డ్యూటీకి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి తన బైకుపైన వెళ్లాడు. గురువారం రాత్రి పీజీ హాస్టల్‌లో ఉండి శుక్రవారం రాత్రి ఇంటికి వస్తానని చెప్పి వెళ్లాడు. మూడు రోజులైన కుమారుడు రాకపోవడంతో తండ్రి శివశంకర్‌రెడ్డి ఫోన్ చేశాడు. ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో ఆందోళనకు గురైన తండ్రి సాఫ్ట్‌వేర్ కంపెనీ వద్ద, బంధువుల వద్ద విచారించినా ఆచూకీ లభించలేదు. దీంతో శనివారం ఉదయం తండ్రి శివశంకర్‌రెడ్డి తన కుమారుడు కనిపించడం లేదని హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్రెడిట్ పాయింట్స్ పేర మోసం

- ఓటీపీతో రూ.99వేలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

కొత్తపేట, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఐసీఐసీఐ బ్యాంకు క్రెడిట్ పాయింట్లు విక్రయించవచ్చని చెప్పిన సైబర్ నేరగాళ్లు ఓటీపీ సేకరించి, మహిళ ఖాతా నుంచి రూ.99,282 కాజేశారు. ఎల్‌బీనగర్ ప్రాంతంలో ఉండే ప్రైవేటు ఉద్యోగినికి ఫిబ్రవరి 26న సైబర్ నేరగాడు ఫోన్ చేశాడు. తనను తాను ఐసీఐసీఐ బ్యాంకు సిబ్బంది అని పరిచయం చేసుకున్నాడు. ఐసీఐసీఐ బ్యాంకుకు చెందిన క్రెడిట్ పాయింట్స్ 24,837 వ్యర్థం అయిపోయాయని, క్రెడిట్ పాయింట్లను విక్రయించి సొమ్ము చేసుకోవచ్చని నమ్మబలికాడు. తిరిగి క్రెడిట్ పాయింట్స్ కలపాలంటే కార్డు వివరాలు పంపాలని కోరాడు. ఇలా ఆమె క్రెడిట్ కార్డు వివరాలు సేకరించాడు. ఓటీపీ చెబితేనే క్రెడిట్ పాయింట్‌లు యాడ్ అవుతాయని నమ్మించి ఓటీపీ వివరాలు తీసుకున్నాడు. నాలుగు సార్లు ఓటీపీ తీసుకుని ఆమె ఖాతా నుంచి రూ.99,282 వేరే ఖాతాలకు బదిలీ చేసుకున్నాడు. మళ్లీ ఓటీపీ వచ్చింది చెప్పమని కోరడంతో అనుమానం వచ్చిన బాధితురాలు ఫోన్‌కు వచ్చిన మెసేజ్‌లు చూసుకుంది. మోసపోయానని గ్రహించిన బాధితురాలు శనివారం రాత్రి సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్



వాటర్ హైడ్రాలిక్ క్రేన్ పనితీరును వివరిస్తున్న విద్యార్థి

దిల్‌సుఖ్‌నగర్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం చేస్తాయని ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాలలో భాగంగా వివేకానందనగర్‌లోని పాణినీయ మహావిద్యాలయ పాఠశాలలో శనివారం నిర్వహించిన సైన్స్‌ఫెయిర్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన నమూనాలను పాఠశాల ప్రిన్సిపాల్ ఉషారాణితో కలిసి శ్రీనివాస్ పరిశీలించారు. భౌతిక శాస్త్రంలో ఉన్న హైడ్రాలిక్ లిఫ్ట్, గాలి, నీరు, బొగ్గు ద్వారా విద్యుత్ తయారీ విధానం, సౌరశక్తి వినియోగం, వాటర్ హైడ్రాలిక్ క్రేన్, స్మార్ట్ కళ్లద్దాలు, డయాలసిస్, గుండె పనితీరు, రసాయన చర్యల కంప్యూటర్ నమూనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచినవి. పాఠశాల ఏజీఎం సతీష్, జోనల్ కో ఆర్డినేటర్ రవికుమార్, డీన్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

లయోల హైస్కూల్లో..

వనస్థలిపురం : వనస్థలిపురం లక్ష్మీగణపతి ఆలయం సమీపంలోని లయోల హైస్కూల్లో శనివారం నిర్వహించిన విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి లయోల విద్యాసంస్థలు, శ్రీఇందు ఇంజనీరింగ్ కళాశాలల చైర్మన్ రంగినేని వెంకట్రావ్, వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ సీహెచ్.శ్రీనివాస్‌లు హాజరై విద్యార్థులు రూపొందించిన పలు నమూనాలను పరిశీలించి వాటి ప్రాముఖ్యతను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మన్సూరాబాద్ : విద్యార్థుల్లో మేధాశక్తిని పెంపొందించేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని కాకతీయ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ వైస్ చైర్మన్ ఎస్.వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. మన్సూరాబాద్ డివిజన్ సెంట్రల్‌బ్యాంక్ కాలనీలోని కాకతీయ పాఠశాలలో విజ్ఞాన ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు చేపట్టిన 120 రకాల ప్రదర్శనలతో ఆకట్టుకోగా ప్రతిభకనబరిచిన వారిని అభినందించి బహుమతులు అందజేశారు. పాఠశాల జోనల్ ప్రిన్సిపాల్ రమేష్‌చంద్ర, డైరెక్టర్లు బీవీడీ రవిప్రసాద్, రాధ, ప్రిన్సిపాల్ పరిమళ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

భూదాన్, సీలింగ్ భూముల్లో ప్రభుత్వ బోర్డుల ఏర్పాటు

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పిగ్లీపూర్‌లోని సర్వే నంబర్ 17 పార్ట్‌లోని భూదాన్, సీలింగ్ భూముల్లో రెవెన్యూ అధికారులు శనివారం ప్రభుత్వ బోర్డులు ఏర్పాటు చేశారు. సదరు సర్వే నంబర్‌లో సీలింగ్, భూదాన్ భూములను గుర్తించిన అధికారులు తహసీల్దార్ ఆదేశాల మేరకు ఆర్ఐ, సర్వేయర్ దగ్గరుండి సిబ్బందితో ప్రభుత్వ అని బోర్డులను నాటించారు. అందులో ఎలాంటి క్రయ విక్రయాలు జరుపొద్దని బోర్డులపై రాశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం గుర్తించిన సీలింగ్, భూదాన్ భూముల్లో క్రయ విక్రయాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ప్రభుత్వ భూముల కబ్జాలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు పెడతామన్నారు.

పెంచిన ఫీజులను తగ్గించాలని విద్యార్థుల తల్లిదండ్రుల నిరసన



పెంచిన ఫీజును తగ్గించాలని హయత్‌నగర్‌లో జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

హయత్‌నగర్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పాఠశాల నిబంధనలకు వ్యతిరేకంగా అడ్డగోలుగా హయత్‌నగర్‌లోని జీస్కూల్ యాజమాన్యం 50శాతం ఫీజులు పెంచారని నిరసిస్తూ శనివారం విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల ఎదుట ఆందోళన చేశారు. అనంతరం ప్లకార్డులు ప్రదర్శిస్తూ హయత్‌నగర్‌లోని జాతీయ రహదారి వరకు ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఒక్క సారిగా జీ స్కూల్ యాజమాన్యం ఫీజులను 50శాతం పెంచి చెల్లించాలని విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నారని అన్నారు. నెల రోజులుగా తాము నిరసన వ్యక్తం చేస్తున్నా యాజమాన్యం స్పందించడం లేదని అన్నారు. అడ్డగోలు ఫీజులు పెంచిన పాఠశాలపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలు కూడా పాటించకుండ యాజమాన్యం ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా పాఠశాల యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చలు జరిపి పెంచిన ఫీజును తగ్గించాలని కోరారు.